

శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ ఎడిటర్స్ : VAS ప్రసాద్, గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంధ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

సంపుటి : 08
సంచిక : 11

## నేపథ్యం:
## గురుభక్తి - ద్వైత నాశనము

వైశాఖ పౌర్ణమి
మే 12, 2025

| | |
|---|---|
| పూజ్యశ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం | శ్రీ సుబ్బరామయ్య సర్ ఈ సత్సంగం లో మనలో సంస్కారాలను గుర్తించి సద్గురు సేవ కు అడ్డువచ్చే సంస్కారాలను తొలగించుకొనే మార్గము గూర్చి వివరిస్తున్నారు. సాధనకు, సద్గురు కృపకు అది అత్యావశ్యకం అని చెబుతున్నారు. |



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

యదంఘ్రి కమల ద్వంద్వం - ద్వంద్వ తాప నివారకం
తారకం భవ సింధోశ్చ - త్వం గురుం ప్రణమామ్యహం

## విషయ సూచిక


| # | విషయం | పేజీ నెంబర్ |
|---|---|---|
| 1 | సంపాదకీయం | 4 |
| 2 | భక్తుల అనుభవాలు | 21 |
| 3 | శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు | 23 |





## సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

# సంపాదకీయం

ఓం సాయిరాం

**మేలుకొలుపు ఆరతినిచ్చిన - గొలగమూడివాసా**
**దివ్య రూపమును చూపుము మాకు - గైకొని సేవా**
**కామక్రోధముల నా మనస్సును - వత్తిగా చేసి**
**వైరాగ్యమనే నేతిలోనా ఆ వత్తిని తడిపి**
**స్వామిపై గల గురుభక్తీయను - జ్యోతీ వెలిగించి**
**ఆ వెలుతురులో ప్రకాశించిన - గురుదేవుల చూచి**
**ద్వైతము నశించి జీవుడు - తత్స్వరూపి ఆయే దేవా      ॥ దివ్య॥**

భగవంతుని సంకల్పం వలన పుట్టిన మనస్సుకి ఉన్న ముఖ్య గుణం వేరుగా చూడటం. ఆ మనస్సు తన చుట్టూ ఉన్న వ్యక్తులు, పరిస్థితులను చూసి ఇష్టం, అయిష్టం పెంచుకుంటుంది. ఆ ఇష్టాయిష్టాలను మనకు తెలియకుండా పెంచుకోవడం వలన మనము కామ (రాగము, కోరికలు), క్రోధములతో (ఆవేశము, ద్వేషములతో) ప్రవర్తిస్తూ భగవంతుడు సృజించిన ప్రపంచలోని వ్యక్తులు, పరిస్థితుల పట్ల వ్యామోహంతో (నాదే అని) ప్రవర్తిస్తూ ఉంటాము. ఈ కామ క్రోధముల వలన ప్రేరేపింపబడి మనం చేసే పనుల వల్ల ప్రపంచాన్ని బాగుపరుస్తున్నామని భ్రమపడుతూ ఇంకా అశాంతిలో బ్రతుకుతున్నాము. మనము అశాంతి లో ఉన్నామా లేదా ? అనేది తెలుసుకునేది ఎలా ? అంటే మనము ఏమి చేయకుండా కూడా


ప్రశాంతంగా, ఆనందంగా ఉండగలగుతున్నామా అని చూసుకోమన్నారు. ఈ యాసిడ్ టెస్ట్ చేస్తే మనకు తెలిసేదేమంటే మనం వ్యామోహంలో ఉన్నాము అని. ఈ వ్యామోహం నుండి బయట పడాలంటే మహాత్ములు చెప్పిన మార్గం : అంతటా భగవంతుడు ఉన్నాడని, అన్నీ భగవంతుడి సంకల్పానుసారమే జరుగుతోంది అని విశ్వసించి, అనుభవం చేసుకొనే జీవిత విధానంలో ఉండటం. ఇది అవగాహన, హృదయ గతము కావటమే వివేకం. అనుక్షణం ఈ ఎరుక నిలుపుకొంటూ చేసే ప్రయత్నం వల్ల వైరాగ్యం (రాగము/ద్వేషము లేకుండటం) అలవడుతుంది. ఈ వైరాగ్యం శాశ్వతము అవ్వాలి అంటే ఆశ్చర్యము, ప్రేమను కలిగించే ఆ భగవంతుని లీలలు, రూపము, నామము పై భక్తి కలిగి ధ్యాస లగ్నం కావాలి. అదే ధ్యానం. దానికోసం భగవంతుడే అపార కరుణతో మహాత్ముల (సద్గురువు) రూపంలో భూమి మీదకు వస్తాడు. అటువంటి సద్గురువు జీవిత విధానము, ఆయన చుట్టూ చేరిన వారి జీవితాలలో, ప్రకృతిలో సహజంగా జరిగే చిత్ర-విచిత్రములను చూస్తే మనకు ఆ సద్గురువు శక్తికి ఆశ్చర్యం, పరమ ప్రేమ కలుగుతాయి. ఆశ్చర్యం, ప్రేమ కలిస్తే దానిని భక్తి అంటారు. అలాంటి గురుభక్తి వల్ల మన యొక్క ప్రజ్ఞ పెరిగి అన్నింటా, అంతటా భగవంతుడు ఉంటాడని తెలిసి దానిలో స్థిరపడతాము.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

పై ఆరతి వాక్యాలకు సజీవ వివరణగా మహాత్ముల అందరి చరిత్రలలో ఎందరో భక్తులకు జరిగిన చక్కటి అనుభవాలు మనకు కామ-క్రోధాల నుండి గురుభక్తి వైపు మరలే మార్గము, వివేకము - వైరాగ్యముల తో నడచుకొనే మార్గదర్శకత్వము అద్భుతరీతిన చేస్తాయి. అట్టి కొన్ని సంఘటనలను ఇచ్చట స్మరించుకుందాము.

**శ్రీ భరద్వాజమాష్టారు రచించిన శ్రీ సాయిలీలామృతములో కామ - క్రోధములకు మూలమైన విమర్శ, ఇష్టాఇష్టాలు, రాగాద్వేషాలు ప్రకోపించే సన్నివేశాలలో సాయినాధుడు హెచ్చరించిన, సన్మార్గ వర్తనకు మార్గదర్శకత్వం చేసిన అనుభవాలు కొన్ని ఇచ్చట స్మరించుకొనుటకై యధాతదం పొందు పరచటమైనది.**

***విమర్శ - వాక్ నియమము :***

“సామాన్య బోధకునిలాగా సాయిబాబా 'మాయ', 'బ్రహ్మము' మొ॥న పెద్ద పెద్ద మాటలు వల్లించలేదు. సామాన్యులకవి నిరుపయోగమేగాక, అహాన్ని పెంచుతాయిగూడ. సామాన్యంగా ఎంతో చిన్నవనిపించే విషయాలే చాలా పెద్దవి. వాటిని చక్కదిద్దుకొని, **నిజమైన మానవత్వాన్ని అలవరచుకొనడమే ధర్మమని, దాన్ని సాధించకనే సాధన ప్రారంభిస్తే ఇహపరాలు రెండూ చెడతాయనీ ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి.**

వెనుక సాయిచెప్పిన మామిడిపూతవలె మనం సద్గురుభక్తి నుండి మధ్యలో రాలిపోకుండాను, మరుజన్మలో దుఃఖం కలుగకుండానూ వారి ఉపదేశాలు ఉపకరిస్తాయి. సాయి భక్తులనెలా హెచ్చరించేవారో చూద్దాము:

ఒకసారి అంజన్వేల్ నుండి మధురదాస్ అనే భక్తుడువచ్చి, సగుణమేరునాయక్ ఇంట్లో దిగాడు. ఒకరోజు వాళ్ళిద్దరూ సాటివారి దోషాల గురించే మాట్లాడుకున్నారు. తర్వాత మధురదాసు మశీదుకు వెళ్ళగానే బాబా చికాకుగా. "ఏమిటి సగుణ్ అంటున్నాడు?" అన్నారు. తమ సంభాషణ బాబాకెంతో బాధ కలిగించిందని అతడు గ్రహించాడు. దుష్ప్రచారం "దానిని ఆసక్తితో వినడమేగదా దుస్సాంగత్యమంటే? అది నిజమైనా, అబద్ధమైనా సర్వమూ సాయిరూపమన్న వివేకం పాడుచేసి, పుణ్యమపహరించి, హృదయాన్ని కలుషితం చేస్తుంది. అలాగే ఒకరోజు వసతిగృహంలో ఒకడు వేరేవారి గురించి అపవాదులు కల్పించి, వారి మనస్సులు విరిచేయాలని తలచాడు. తర్వాత అతడు బాబా లెండీకి వెళ్తుంటే ఎదురయ్యాడు. అపుడాయన, మలం తింటున్న ఒక పందిని అతనికి చూపి, **“అది మలమెంత ప్రీతిగా తింటోందో చూచావా? సాటివారి గురించి అపవాదులు కల్పించడమలాంటిదే! క్రమంగా మనలను సాటివారు ఏవగించుకుంటారు. అంతేకాదు, అలాచేస్తే మనం కష్టపడి సంపాదించుకున్న పుణ్యమంతా వారికి, వారి పాపం మనకు వస్తాయి. ఇక**

**శిరిడీ యాత్రవలనగూడ మనకేమి ప్రయోజనం?"** అన్నారు. అందుకే క్రీస్తు, "ఇతరుల దోషాలెంచకు; ఎంచితే భగవంతుడు నీ లోపాలెంచుతాడు. (క్షమించడు)" అని, సాటివారినెంత కొద్దిగా నిందించినా నరకంలో శిక్ష తప్పదనీ చెప్పాడు. "ప్రక్కవాడి కంట్లో నలుసు తీసేముందు, నీ కంటిలోని (తప్పులెంచే లక్షణమనే)" దూలాన్ని తొలగించుకో!" అన్నాడు.

***భేదభావము - కోపము - ద్వేషము :***

**ఇతరులను మనస్సులో గూడ ద్వేషించకూడదు.** హత్య, శతృత్వము, ఋణము- వీటి ఫలితమనుభవించక తప్పదన్నారు సాయి. ఒకరోజొక భక్తుడు రవ్వకేసరి ప్రసాదంగా పంచుతున్నాడు. వేరొక భక్తునితో, "ప్రసాదం తీసుకున్నావా?" అన్నారు బాబా. అతడికి, తనకూ భేదాభిప్రాయాలుండటం వల్ల ప్రసాదం తీసుకోలేదన్నాడతడు. అపుడు **సాయి, 'ఇచ్చేది, యివ్వబడేది. పుచ్చుకొనేది యెవరు? అంతా ఒక్కటే. ఎవరినీ శతృవులుగా తలచవద్దు' అన్నారు**. ద్వేషమెంత ప్రమాదకరమో! చెన్నబసప్ప వీరభద్రప్ప అనే పాము కప్పలకు పూర్వజన్మలో సాయిసన్నిధి లభించినా, పరస్పర ద్వేషంవలన హీనజన్మలు లభించాయి.

పై రెండు బలహీనతలకూ భిన్నమయిన మరొకదానిని గురించి ఒకసారి నానాచందోర్కరుతో **సాయి యిలా చెప్పారు: 'యాచించిన వారికి శక్తి కొద్దీ సమర్పించు. ఇంకా అడిగితే వీలుకాదని సౌమ్యంగా చెప్పు. కోపించవద్దు.'** కొంత కాలానికి కళ్యాణ్ లో అతనింటికి ఒక బిచ్చగత్తె వచ్చి, పెట్టినదానితో తృప్తి చెందక ఇంకా కావాలని పట్టుబట్టింది. అతను సేవకునితో, "పెట్టింది తీసుకు పొమ్మను, లేకుంటే మెడపట్టి గెంటు!" అన్నాడు. ఆమె వెళ్ళిపోయింది. తర్వాత అతడు శిరిడీ వెళ్ళినపుడు సాయి అతనితో పలుకలేదు. కారణమడిగితే, "నా మాట విననివారితో నాకేం పని? ఆ బిచ్చగత్తెను, అధికంగా భిక్ష కోరినందుకు మెడపట్టి గెంటమంటివే? ఆమె వాకిట్లో కూర్చుంటే నీదేం పోయింది" అన్నారు.


అంతేగాదు, ఆవేశమెన్నడూ తగదని సాయి ఎంత చమత్కారంగా బోధించారో! ఆయన ఒక భక్తుని దక్షిణ అడిగారు. అతడు తన వద్ద పైకం లేదన్నాడు. అయినా ప్రతి 10, 15 ని॥లకు సాయి అతనిని తిరిగి తిరిగి అడిగారు. చివరకతడు విసిగిపోయి, "నా వద్ద డబ్బు లేదంటూంటే!" అని గొంతు చించుకున్నాడు. సాయి కొంటెగా నవ్వి, **"లేకపోతే లేదని నెమ్మదిగా చెప్పు. అదీగాకుంటే ఊరుకో, అరుస్తావెందుకు?"** అన్నారు.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

***ఇంద్రియ నిగ్రహము - కామ క్రోధముల రక్షణకు సద్గురు సన్నిధి :***

నిత్యజీవితంలో మనస్సు, ఇంద్రియాలను ఎలా నిగ్రహించుకోవచ్చో సాయి తెల్పారు. ఒకసారి ముస్లిము స్త్రీలిద్దరు బురఖాలు ధరించి దర్శనానికి వచ్చారు. నానా లేచి బయటకు వెళ్ళబోతే బాబా, "నీవిక్కడే వుండు, వాళ్ళు రాదల్చుకుంటే వస్తారు" అన్నారు. వాళ్ళు ముసుగులు తొలగించుకొని బాబా దర్శనం చేసుకున్నారు. వారిలో ఒక యువతిని చూడగానే నానా మనస్సు చలించింది. వెంటనే బాబా అతని తలపై చరచారు. అతడు సిగ్గుతో తలవంచుకోగానే ఆయన, "నానా, **నీవు మానవుడవు గనుక ఇంద్రియాలు విషయాలపై ప్రసరించినపుడు కోరిక కలుగుతుంది. కాని అందమైన దేవాలయాలెన్ని లేవు? మనం బాహ్యసౌందర్యాన్ని గాక లోనున్న దైవాన్ని చూడాలి. ఆ సౌందర్యాన్ని కల్పించిన దైవలీలలను చూడాలి. ఇదెప్పుడూ మరువకు"** అన్నారు.

సాఠే శిరిడీలో తానుకొన్న స్థలం చూడ్డానికి తన భార్యను బయలుదేరమన్నాడు. ఇంతలో అతని మామగారు, ఆడపిల్ల స్థలం చూచేదేమిటని అడ్డు చెప్పడంతో ఆమె రానన్నది. తన మాట కాదన్నదన్న కోపంతో ఆమెను కొట్టడానికి కొరడా తీసుకున్నాడు సాఠే. ఆ క్షణమే అతనిని మశీదుకు రమ్మనమని బాబా కబురు పంపారు. అతడు వెళ్ళగానే ఆయన, "ఏమిటి నీ గోల? అమ్మాయి స్థలం చూడకపోతేనేమి?" అని

మందలించారు. **తన యింట జరిగే ప్రతిదీ ఆయనకు తెలుస్తుందని** సాఠే **గుర్తించాడు.**

చెన్నభద్రప్ప - వీరభద్రప్ప సంఘటన ఆధారంగా మాష్టారు ఇలా చెపుతారు. **మానవులు చేసిన కర్మలే కాక భావాలు కూడా మరు జన్మలకు కారణమౌతాయి.** అందుకే సాటి మనిషిని, "పనికిమాలినవాడా!" అని తిట్టినా నరకమొస్తుందని క్రీస్తు చెప్పాడు. సాటివారిని పరోక్షంగా నిందించడం పాపమని సాయి బోధించిన మరొక సంఘట యింతకుముందు గమనించాము. అందుకే **మానవుడు సాత్త్విక భావాలనలవరచుకుని అసుర భావాలు తొలగించుకోడం ఆధ్యాత్మిక జీవితానికంతటికీ పునాదిగా చెప్పింది భగవద్గీత.**


***శ్రీ మాష్టారు రచించిన శ్రీ అక్కల్ కోట మహారాజ్ చరిత్రలో కూడా ఎందరో భక్తులను కామ, క్రోధాలు, అహంకారము అను బృహత్ రోగాల నుండి చిత్రమైన అనుభవాలతో వివేక వైరాగ్యాలను ప్రసాదిస్తూ - గురు భక్తి అను జ్యోతి ని వెలిగించిన కొన్ని సన్నివేశాలను ఇచ్చట స్మరించు కొందాము.***

భాగవతంలో శ్రీహరి చెప్తాడు - తాను కటాక్షించిన భక్తుడి నుండి తాను ముందుగా సర్వసంపదలనూ హరించిన తరువాతనే కటాక్షిస్తాను అని. స్వామికి అతి సన్నిహితుడైన భక్తుడు శేషాచారి. నిత్యాగ్ని హోత్రం, అయిదిళ్ళ దగ్గర భిక్ష అతని నియమాలు. స్వామి తీవ్రమైన కోపంలో

వున్నప్పటికి గూడా ఇతర భక్తుల లాగ గాక శేషాచారి ధైర్యంగా ఆయన దగ్గరకు వెళ్ళేవారు. ఆయనను చూడటంతోనే స్వామి శాంతించేవారు. అప్పుడప్పుడూ ఆయన స్వామికి నశ్యం గూడా యిస్తూండే వారు. కాని అదేమి చిత్రమో గాని స్వామి అందరికీ మిఠాయి పంచినపుడు గూడా ఇతనికి మాత్రం ఎప్పుడూ పెట్టేవారు కారు. ఒకసారి వుండబట్టలేక మర్నాడు స్వామిని మిఠాయి అడగాలనుకొన్నాడు శేషాచారి. మరుసటి రోజు నుంచి స్వామి అతనికట్టి అవకాశమే యివ్వలేదు. అతనెప్పుడు దర్శనానికి వచ్చినా స్వామి నిద్రపోతుండేవారు. అలా కొన్ని రోజుల పాటు స్వామి దర్శనం కూడా దొరక్కుండా పోయింది. స్వామి ప్రవర్తన అతనికేమీ అర్థంకాలేదు. అకస్మాత్తుగా ఒక రోజున తన తప్పు శేషాచారికి తట్టింది. తనకు మిఠాయి యందు కోరిక కలగడమే ఇన్నింటికీ కారణమని గ్రహించాడు. **అప్పటి నుండి అతడు దేనినీ కోరగూడదని నిర్ణయించు కొన్నాడు. అంతేగాదు, పేడతో చిన్న చిన్న వుండలు చేసి వాటిని నోట్లో పెట్టుకొని, "నేనెప్పుడు దేనిని కోరినా నాకిలాగే అగుగాక! అన్ని కోరికలూ వీటితో సమానమన్న సంగతి నాకెన్నడూ గుర్తుండుగాక!" అనుకొన్నాడు. సరిగ్గా అదే సమయానికి స్వామి తన పెద్దపొట్టను రెండు చేతులతో పట్టుకొని మహా సంతోషంగా విరగబడి నవ్వుతున్నారు. ఏ మహాత్ముడికైనా తన భక్తుడు కోరికలను జయించాడంటే సంతోషమే కదా!**








ఒక బ్రహ్మచారి బాబా కొద్దిమంది శిష్యులతో అక్కల్కోట చేరాడు. దర్శనానంతరం బ్రహ్మచారి బాబా బసకుచేరి, వంట చేసుకుంటూ తన శిష్యులను బెల్లం కొనుక్కురమ్మని బజారుకు పంపాడు. అదే సమయానికి చోళప్ప మఠంలో కూర్చునియున్న స్వామి **"ఆ వెధవ లఖూ నాకు పెట్టకుండా బెల్లం తింటున్నాడు"** అంటూ మారాం చేయడం మొదలుపెట్టారు. స్వామి మాటలలో ఎంత నిజముందో పరీక్షించే అవకాశం కలిగినందుకు సంతోషిస్తూ మంజ్రేకర్ అను భక్తుడొకడు పరుగున బజారుకు వెళ్ళాడు. స్వామి చెప్పింది అక్షరాలా నిజమైంది. బ్రహ్మచారి బాబా శిష్యుడు లఖూ పెద్ద బెల్లంముక్క చప్పరిస్తూ ఇంటికి వెడుతున్నాడు. మంజ్రేకర్ చెప్పిన వార్తవిని లఖూ పరుగున వెళ్ళి స్వామి పాదాలమీదపడి క్షమాపణ వేడుకున్నాడు. **అప్పటి నుంచి దైవానికి నివేదన పెట్టకుండా ఏదీ తినకూడదని, జిహ్వాచాపల్యాన్ని అరికట్టడం సాధకునికెంతో అవసరమనీ అనేకసార్లు బ్రహ్మచారిబాబా చెప్పిన మాట, లఖూ మనస్సులో ఈ సంఘటన వలన చాలా బలంగా నాటుకుపోయింది. నియమం యొక్క ఆవశ్యకతతోపాటు శ్రీ స్వామి యొక్క సర్వజ్ఞత్వం కూడా అతనికి మరువరాని విషయం అయింది.**

***పొగరుబోతు - మాట వినని గుర్రము (మనస్సును)ను నా పరం చేయి అని శ్రీ వెంకయ్య స్వామి చెప్పిన వాక్యాలకు శ్రీ అక్కల్ కోట స్వామి చరిత్రలో ని సంఘటనల వివరణ:***

అక్కల్ కోటలో ఒక ఆడకోతి మనుషులను కరవడం, వస్తువులను నాశనం చేయడం చేస్తూ జనాన్ని ఎంతో చీకాకుపరిచింది. ఫిర్యాదు రాజుగారికి చేరి, ఆయన గార్డన్ అను దొరను ఆ కోతిని చంపడానికి పంపారు. అతడా కోతిని పట్టి ఖండోబా ఆలయానికి వెనుకవైపుకు తీసుకొచ్చాడు. (ఆ ఆలయం లోనే శ్రీస్వామి అక్కల్ కోటలో మొదటిసారిగా ఆశ్రయం తీసుకొన్నది.) ఇంతలో ఒక భక్తుడావార్తను స్వామికందజేసాడు. అదివిని స్వామి అన్నారు. 'ఆ కోతిని ఇక్కడకు తెమ్మన్న నా ఆజ్ఞను వాడికందజేయి!' అని. రాజగురువులైన శ్రీస్వామివారి ఆజ్ఞను తిరస్కరించే ధైర్యం ఎవ్వరికీలేదు. తక్షణమే ఆ కోతిని, ఆ దొరనూ స్వామి సమక్షంలోకి తీసుకొచ్చారు. **స్వామి ప్రేమతో ఆ కోతిని దగ్గరకు తీసుకొని దాని ఒళ్ళు నిమురుతూ, "ఇక ముందెవ్వరికీ ఎటు వంటి బాధా కలిగించకు. తెలిసిందా?" అనిచెప్పి దానిని విడిచిపెట్టారు.** ఆ కోతి వెళ్ళిపోయింది. **కాని ఆ రోజునుంచి ఆ కోతిలో పరిపూర్ణమైన మార్పు వచ్చింది. అది ఎంతో సౌమ్యంగా మారి పోయింది. నిత్యము మహాభక్తునిలాగా స్వామి దర్శనం చేసికొనేది.** స్వామి దానితో కబుర్లు చెప్పి దానికి టోపీ పెట్టి దండ వేసేవారు.

రాజుగారి ఏనుగులలో 'జవహర్' అనే పట్టపుటేనుగు ఒకటి వుండేది. ఒకరోజు జవహర్ మత్తెక్కి ఊరుమీదపడి మనుషుల మీద రాళ్ళు రువ్వుతూ,

ఇళ్ళు కూలదోస్తూ ఎంతో భీభత్సం చేసింది. జనమంతా భయంతో కేకలేస్తూ పరుగులు తీశారు. ఆ జంతువును తుపాకితో కాల్చి చంపడం తప్ప ఎవరిక్షి మరోమార్గం తోచలేదు. అంతవరకు నిర్లిప్తంగా వున్న స్వామి నడుమున చేతులు ఉంచుకొని నిర్భయంగా ఏనుగువైపుకు నడిచారు. **స్వామిని చూస్తూనే జవహర్ అల్లరి మాని ఆయన ముందు మోకరిల్లింది.** మనుష్యులకు లేని వివేకం, మహాత్ముల దివ్యత్వాన్ని గుర్తించే శక్తి ఒక్కొక్కప్పుడు జంతువులకు వుండవచ్చునన్న మాట.

ఒకసారి స్వామి వారు దేశ్ ముఖ్ అనే భక్తుడి ఇంట్లో కూర్చొని వున్నారు. అప్పుడు శ్రీమతి శివాబాయి అనే ఇల్లాలు తన కొడుకును స్వామి ముందుంచుతూ, “ఉపనయనం అయిన దగ్గర్నుంచీ నా బిడ్డకు చూపు లేకుండా పోయింది. వాడికి దృష్టి ప్రసాదించవలసింది" అని కోరింది. అప్పుడు స్వామి అన్నారు: "మమ్మల్ని పరీక్ష చేయడానికి ఐదుగురు రాక్షసులు వస్తున్నారు. వారు వచ్చాక అతనికి దృష్టి కలుగుతుంది" అన్నారు. సరిగ్గా స్వామి అన్నట్లే కొద్దిసేపట్లో ధృడంగాను, నల్లగానూ వున్న ఐదుగురు బ్రాహ్మణులు వచ్చారు. వారి కంకణాలు, దుశ్శాలువలూ చూస్తే వారు పండితులనే సంగతి తెలుస్తూనే వున్నది. వారు స్వామిని పరీక్షించడానికి వచ్చారు. రాగానే స్వామిని పలుకరించక, వారిని ఎలా పరీక్ష చేయాలి అన్న

విషయం గురించి వారిలో వారే సంస్కృతంలోనూ, కన్నడంలోనూ సంభాషించు కొన్నారు. 'ఆ తరువాత వినయాన్ని నటిస్తూ స్వామికి నమస్కరించారు. అపుడు స్వామి అంధుడైన ఆ పిల్లవానితో, "గణేషా! ఇటువచ్చి ఆ నల్లటి రాక్షసుల మనసులలో వున్న ప్రశ్నలూ, వాటికి సమాధానాలూ చెప్పు!" అన్నారు. వెంటనే ఆ పిల్లవాడక్కడికొచ్చి నిల్చొని స్వామికి నమస్కరిస్తూ, 'నాకేమీ తెలియదే? నేనెట్లా చెప్పేది?' అన్నాడు. స్వామి నవ్వుతూ, “ఓహో, అలాగా!" అని తన మెడలో వున్న చేమంతి పూలదండ ఆ అంధుని మెడలో వేసి, రెండు చామంతి పూలతో అతని రెండు కళ్ళను తాకారు. ఆ పిల్లవాడు తన వెన్నులో నుంచి ఏదో మహాశక్తి ప్రవహించి నట్లు ఒక పులకరింతతో లేచి నిల్చొని వారి మనస్సులోని ప్రశ్నలు చెప్పి వాటన్నిటికీ శాస్త్రాధారాలతో సమగ్రంగా సమాధానాలు కూడా చెప్పాడు. అపుడా బ్రాహ్మణులు స్వామికి నమస్కరించి నిలబడ్డారు. స్వామి ఉగ్రులై వాళ్ళ నాయకుణ్ణి ఉద్దేశించి యిలా అన్నారు : "అన్ని కులాల వారి దగ్గర విచక్షణ లేకుండా భిక్ష తీసుకుంటు న్నానని మీరు నన్ను పరీక్ష చేయడానికి వచ్చి పరీక్ష చేశారు. కాని ఇదిగో నేను చెపుతున్నా విను. నీవు మీ తల్లికి ఒక ముసల్మానుకూ ఉన్న అక్రమ సంబంధం వలన పుట్టావు. ఆ యవనుని పేరు ఇమాన్బ ముసల్మాను". స్వామిని పరీక్ష చేయబోవడం ఎంత

ప్రమాదమో ఆ బ్రాహ్మణుడు వెంటనే గ్రహించి వారిని క్షమాపణ కోరాడు. అపుడు స్వామి శాంతించి, **హృదయపూర్వకమైన పశ్చాత్తాపం పవిత్ర గంగాస్నానంలాగా మానవుని పూర్తిగా పునీతుని చేయగలదని చెప్పి ఇక ముందు మంచి నడత గలిగి బ్రతకమని హితవు చెప్పారు**. ఆ క్షణం నుంచి ఆ అంధ బాలుడికి దృష్టి లభించింది. అంతేకాదు, తరువాత అతడు మహా పండితుడయ్యాడు.

***అహంకారము అనే మత్తగజాన్ని లొంగతీసే సద్గురునిగా :***

అక్కల్ కోట సంస్థానపు రాజైన మాలోజిరావ్ భాంస్లే స్వామికి భక్తుడు. అప్పుడప్పుడు స్వామి కూడా స్వేచ్ఛగా రాజ భవనంలోకి వెళ్ళి వస్తుండేవారు. రాజు గూడ స్వామి దర్శనానికి చోళప్ప మఠానికి వస్తూండేవాడు. ఒకసారి రాజు తన జన్మదినాన స్వామి దర్శనానికి రాజలాంఛనాలన్నింటితోనూ బయలుదేరాడు. కిరీటం, కవచం, కుండలాలు ధరించి ఏనుగునెక్కి భటుల తోను, సైన్యాలతోను, రాణులతోనూ, చోళప్ప మఠం చేరి, స్వామి ముందు నుంచొని నమస్కరించాడు. ఈ ఆడంబరాలు స్వామికి నచ్చలేదు. కన్నెత్తయినా చూడకుండా మౌనంగా కూర్చున్నారు. అప్పుడు స్వామి దృష్టిని ఆకర్షించడానికి ఆయన పాదాలవైపు వంగాడు రాజు. స్వామి ఉగ్రుడై

బలంగా చెంప మీద ఒక దెబ్బ కొట్టారు. ఆ దెబ్బకు కిరీటం పోయి ఇరవై అడుగుల దూరంలో పడింది. నిశ్చేష్టుడై నివ్వెరపోయి రాజు చెంప నిమురుకుంటూ కూర్చున్నాడు. స్వామి అన్నారు: **"నీ రాజరికం నీ భవనంలోనూ, నీ దర్బారులోనూ, సరి పోతుంది. ఇక్కడ అవసరం లేదు. ఇటు వంటి చదరంగంలో నీ వంటి రాజులను ఎంతమందిని కావాలంటే అంత మందిని చేయగలం!"** అప్పటి నుంచి రాజు తన పల్లకిని రెండు మూడు ఫర్లాంగుల దూరంలో ఆపి కాలి నడకన స్వామి సన్నిధికి చేరేవాడు. వేషభాషలలో నిరాడంబరంగా వుండేవాడు.

విష్ణుబువా బ్రహ్మచారి పెద్ద పండితుడు, వేదాంతి, వక్త, అతని అసమాన ప్రజ్ఞకు మెచ్చి అక్కల్ కోట రాజు అతనిని ఆహ్వానించాడు. ఒకరోజు స్వామిని, "బ్రహ్మతదాకార వృత్తి అంటే ఏమిటి?" అని అడిగాడు. స్వామి చిరునవ్వు నవ్వి మౌనంగా ఊరుకొన్నారు. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేని వృద్ధుణ్ణి 'స్వామి' అనడం తగదని బ్రహ్మచారి భావించాడు. అంతేకాదు, పరోక్షంగా తన స్నేహితులతో స్వామి తన ప్రశ్నకు సమాధానం చెప్పలేక పోయారని ప్రచారం చేశాడు. అయినా "స్వామి పట్టించుకోలేదు. ఒక రోజు బ్రహ్మచారికి కలలో కొన్ని వేల తేళ్ళు మీదకు వస్తున్నట్టు కనిపించాయి. అందులో ఒకటి కుట్టను కూడా కుట్టింది. బ్రహ్మచారి పెద్దగా 'చచ్చానర్రోయ్!' అని అరిచాడు. ఆ ప్రక్కనే పడుకొన్న ఒక పారశీ భక్తుడు

బ్రహ్మచారిని నిద్రలేపి కారణమడిగాడు. బ్రహ్మచారి తన కలనంతా వర్ణించాడు. కొన్ని రోజుల తరువాత స్వామిని దర్శించి తిరిగి, "బ్రహ్మతదాకార వృత్తి అంటే ఏమిటి?" అనడిగాడు. స్వామి నవ్వి **"మూర్ఖుడా! వందల తేళ్ళు కలలో కనిపించినంత మాత్రానే కేకలు పెడితివే! నీవు కూడా వేదాంతం మాట్లాడడమేనా! 'బ్రహ్మతదా కార వృత్తి' అంటే అంత సులభమనుకొంటున్నావా? ఏరుకోవడానికి రోడ్డు మీద పడియున్న వస్తువనుకున్నావా? గొంతెత్తి ఉపన్యాసాలివ్వడంతోనూ, మాటలతో గారడీ చేయడంతోనూ బ్రహ్మతదాకార వృత్తి రాదు. కేవలం పుస్తకాలు చదివినంత మాత్రాన పెద్ద యోగినయ్యాననుకున్నావా? ఇక్కడి నుంచి ఫో!" అని కేకలేశారు. మరొక సారి బ్రహ్మచారి వచ్చినప్పుడు స్వామి ఆ వేదాంత విషయాన్ని వివరించి చెప్పటమే గాక అతనికి యోగదీక్షనిచ్చి సమర్థుని చేశారు**.

శృంగేరి మఠం నుంచి మహాపండితుడైన ఒక శాస్త్రి గారు స్వామి దర్శనాని కొచ్చి బావడేకర్ అనే భక్తుడితో కలసి వుంటున్నాడు. ఒకరోజు స్వామి దర్శనం చేసుకొని ఇల్లు చేరాక, శాస్త్రి బావడేకర్తో అన్నాడు "ఈ మహాత్ముని వలన ఏమి లాభం? వట్టి పిచ్చివాడిలా కనపడుతున్నాడే! ఆధ్యాత్మికంగా ఈయన నిన్ను ముందుకు తీసుకుపోలేడు. నేనే నయం. నిన్నొక మంచి పండితుడుగానన్నా తయారు చేయగలను". కాసేపు బావడేకర్ మనస్సు చలించి, శాస్త్రితో వెళ్ళిపోదా మనుకున్నాడు. ఆ రోజు

రాత్రి తలుపు గడియ వేసుకొని ఆ యిద్దరూ లోపల నిద్రపోతున్నారు. అర్ధరాత్రి బావడేకర్ మెలకువ వచ్చి చూచేసరికి తలుపు తనంతటది తెరచుకొంది. ద్వారంలో స్వామి నిలబడి వున్నారు. క్షణకాలం స్వామి అతడి కేసి చూసి, **"నీవెప్పుడు శాస్త్రివి కాబోతున్నావ్? ఈ శాస్త్రి అరిషడ్వర్గాలైన కామ-క్రోధాదులనే జయించ లేదు."** అని చెప్పి అంతర్ధానమయ్యారు. మరుసటి ఉదయం స్వామి బావ డేకర్ను చూచి చిరునవ్వు నవ్వారు. అతడాయన పాదాల మీద పడి క్షమాపణ వేడి ఆ పిచ్చి ఆలోచన పూర్తిగా వదులుకున్నాడు.

శ్రీ వెంకయ్య స్వామి రోసిరెడ్డి గారిని విశేషంగా అనుగ్రహించటానికి కారణం వారి "నియమ పాలన" అని, వారిలా నియమ పాలన చేసే వారు లేరు. ఒకసారి ఎవరో ఏమో అన్నారని స్వామిని విడిచి వెళ్లి పోదాము అనుకున్న అతనితో "అయ్యా, రోసిరెడ్డి ! పంట చేను వదలుకొని పరిగ ఏరు కుంటావయ్యా ?" అని వారించారు, వెనక్కుపిలిచారు అని శ్రీ సుబ్బరామయ్య సార్ వివరిస్తారు.

**వివేక - వైరాగ్యాల తో కూడిన గురుభక్తి వలన కామ - క్రోధాల నుండి బయట పడే నియమపాలనతో సద్గురుని అనుగ్రహం చవిచూచే మార్గంలో మనలను అనుక్షణం నడిపించమని ప్రార్ధిద్దాము.**



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

## భక్తుల అనుభవాలు

గురుభక్తి ప్రదాత్రే నమః

**ప్రసాద్ ఇలా చెపుతున్నాడు:**

ఒకప్పుడు నేను అందరితో పోల్చి చూసుకుంటూ ఉండేవాడిని. అదే సమయంలో సార్ మనస్పూర్తిగా కాకబలి చెయ్యాలని సత్సంగములో వారం వారం చెపుతూ ఉండేవారు. కొన్ని వారాల తర్వాత 'సార్ నాకే చెపుతున్నారా?' అని అనిపించి గొలగమూడి నుండి బెంగుళూరు వచ్చిన తర్వాత సోమవారం నుండి బుధవారం దాకా మూడు రోజుల పాటు ఉదయం అన్నం తినే ముందర 15, 20 నిమిషాల పాటు కాకబలి మనస్పూర్తిగా నా చేత చేయబడింది (ఎందుకు నేను చేయలేదని చెపుతున్నాను అంటే ఆ తర్వాత నేను ఏనాడూ అలా కాకబలి సమర్పించ లేదు.) మూడవరోజు కాకబలి సమర్పిస్తుంటే నేను వంతులు పెట్టుకోవాలంటే ప్రపంచం అంతటితో పెట్టుకోవాలి. ఎందుకంటే ప్రతి ఒక్కళ్ళు భగవంతుని సేవ చేస్తున్నారు అని కనువిప్పు కలిగింది. తర్వాత ఏనాడూ వంతులు పెట్టుకోలేదు. సార్ యొక్క బోధనా దక్షత అద్భుతము.

సుబ్బరామయ్య సార్ చెప్పిన పనులు అందరి కంటే ముందర చెయ్యాలని ఉండేది, ప్రయత్నం చేసేవాడిని. ఒక్కసారి సార్ నాతో అందరినీ పని చేయనివ్వాలని అన్నారు. సార్ చెప్పినది అప్పుడు అర్థం కాలేదు. కొన్ని సంవత్సరాల తర్వాత సార్ కి పక్షవాతం వచ్చి మందు తీసుకున్న తర్వాత కొంచెం తగ్గింది. గురు బంధువులు సార్ పూర్తిగా కోలుకోవడానికి వారికి తెలిసిన, తెలుసుకున్న ప్రయత్నాలు చేస్తున్నారు. నాకు కూడా సార్ ఏదైనా మందు చెపితే ఆ మందు నేను తీసుకొస్తే సార్ కి తగ్గాలి అనేది ఉండేది. ఒకరోజు సార్ మాట్లాడుతూ నెల్లూరులో ఉండే పక్షవాత వైద్య నిపుణులు డాక్టర్ హరి ప్రసాద్ గారిని తీసుకురమ్మన్నారు. అదే నాకు సార్ ఇచ్చిన అవకాశం అనిపించింది. వెంటనే ఆయనకు ఫోన్ చేస్తే ఆయన కావలిలో ఉన్నారని, మూడు రోజులు తర్వాత వస్తారని చెప్పారు. కొంతమంది గురుబంధువుల ద్వారా అమ్మగారికి (సార్ ధర్మపత్ని) ఈ విషయం తెలిసింది. అమ్మగారికి హరిప్రసాద్ గారి చేత మందు ఇప్పించటం ఇష్టం లేదు. ఎందుకు? సార్ కి పక్షవాతం వచ్చినప్పుడు మొట్టమొదట మందు ఇప్పించింది డాక్టర్ హరి ప్రసాద్ గారి చేతనే! ఆయన ఇచ్చిన మందులకు సార్ కి బాగా వేడి చేసేది. సార్ కి జిలగా కూడా ఉండేది. ఇవన్నీ చూసిన అమ్మగారికి మరలా సార్ కి ఇబ్బంది కలుగుతుంది ఏమోనని భయంగా

ఉంది. ఆ సమయంలో మనస్సులో సార్ చెప్పినట్లు చెయ్యాలని (అలా చేస్తే గురు మాట ప్రకారం నడుచుకున్న వాడినని అందరూ పొగుడుతారు అని) ఉంది, కానీ అమ్మగారు చెప్పినట్లు సార్ కి ఏదైనా ఇబ్బంది అయితే చెయ్యటానికి నేను గొలగమూడిలో ఉండలేను. కనుక సందిగ్ధంలో ఉన్నాను. అప్పుడు సార్ ఎదురుగా వెళ్ళి నా మనస్సులోనే నాకు ఉన్న సందిగ్ధం, నా అసహాయతను సార్ కు విన్నవించుకున్నాను. మనస్సు ప్రశాంతతను పొందింది. ఆ తర్వాత నాలో ఎంతో మార్పు కనపడింది. ఎవరు సార్ కి సేవ చేస్తున్నా నాకు  ఆనందంగా ఉండేది. అంతేకాదు సార్ కి సేవ చేసే వాళ్లకు కావలసినవి అందిస్తుండేవాడిని. సార్ కూడా నేను ఇతరులకు చేసే పని ఆయన అంగీకరిస్తున్నట్లు ఆయన చూసే చూపు, కళ్ళతోనే చెప్పినట్లు నాకు ఉండేది. సార్ ఎంతో కృపతో ఆయన చెప్పిన మాట ఆచరించేటట్లు చేయించారు.

## శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు

02-11-2002 న: అధర్మ-తలంపులు, కన్నీటి ప్రార్థన

గొలగమూడి

02-11-2002


Dear Sir,


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్ధన. **దాపరికంలేని నీ లెటర్ చూచి చాలా సంతోషించాను.** ఒక అమ్మాయికి మనసులో చోటివ్వడం ఎంతో అధర్మం కదా! మనకు ఏది శ్రేయస్సో సాయికి తెలుసు. కనుక వారు ప్రసాదించిన అమ్మాయిని స్వీకరించాలి. అంతేగాని ఆ అమ్మాయి తలంపులన్నీ అధర్మమని బాగా చింతించి మనసు నుంచి దూరం చేయాలి. మన అక్క, చెల్లెండ్రను గూర్చి ఎవరైనా ఇతరులు అలా యోచిస్తుంటే మనం సహించగలమా అనేది ఆలోచించు. గనుక అట్టి ఆలోచనలు ఎంత అధర్మమైనవో తెలిసి అట్టి అధర్మకార్యం ద్వారా మనమే మన భవిష్యత్ జన్మలను పాడుచేసుకుంటున్నామనే నిశ్చయానికి వస్తే అలాంటి తలంపులు పోతాయి. అప్పటికీ పోకుంటే ప్రాయశ్చిత్తాలు, తీవ్ర ప్రాయశ్చిత్తాలు self imposed punishments just like Vivekananda చేసుకోవాలి. నీకు తోచిన మరొక మార్గం యోచించు.

T.V. లో sex విషయాలు చూడడం మానసిక బలహీనత - అది వివాహం కాగానే పోదు. భార్య ఉన్నా మరొక విధంగా ఆ బలహీనత పనిచేస్తుంది. **భగవంతుడు సృష్టి కొరకు పెట్టిన ఈ లైంగిక సంబంధాన్ని దుర్వినియోగం చేస్తే ఎంత నష్టపోతామో వ్రాయలేను. మానసిక, శారీరక శక్తులన్నీ ధ్వంసమౌతాయి**. Explode అయిన టపాకాయ నుండి బయల్పడిన కాగితం ముక్కలాగా తయారవుతాము. **మన వీర్యమే మన మేధస్సు అవుతుంది**. వీర్యం పోయినట్లు భౌతికంగా తెలియదు. అది ఇలాంటి తలంపులతో వీర్యం నష్టపరుచుకున్నామంటే మన భవిష్యత్తు ఎంతో దారుణంగా ఉంటుంది. ఇలాంటి తలంపులకు కారణం

(1) దుష్ట **సాంగత్యం** - మనుషులు గాని, పుస్తకాలుగాని అలాంటి సాంగత్యం అయి వుంటుంది.

(2) రెండవ కారణం మనం తినే ఆహారం. ఆహారం కూడా కామ వాసనలు రేకెత్తిస్తుంది. **ఏ ఆహారం తింటే ఇలాంటి తలంపులు వస్తున్నాయో నీవే గమనించి అలాంటి ఆహారం వర్జించు**.

**హృదయపూర్వకంగా ఈ sex బలహీనతనుండి బయటపడకుంటే ఈ బలహీనత మన సర్వస్వాన్నీ హరిస్తుంది**. ఇది మనలోని దొంగ అని చెప్పారు బాబా. ఈ దొంగ పెండ్లితో సమసిపోదు. మరొక విధంగా పనిచేస్తుంది. గనుక **వివేక, విచార, వైరాగ్యాలతో ధర్మమనే వెలుగులో దాన్ని హరింప చేయాలి. జాగ్రత్త! శ్రీ మాస్టారికి నీ బలహీనత చెప్పి దాన్ని తొలగించమని కన్నీటితో ప్రార్థించు. ఇంతకంటే మరొక మంచి మార్గం లేదని నా అభిప్రాయం**. మీ అమ్మ, నాన్న, చెల్లెలు గొలగమూడి వచ్చారు. కానీ రాత్రి 9 గంటలపైన వచ్చి ఉదయం 6 గంటలకు వెళ్లిపోయారు. వాళ్లతో మాట్లాడే అవకాశం రాలేదు. వాళ్లైనా ఏమి అడగలేదు. మరలా లెటర్ వ్రాయి. శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థిస్తూ

మీ పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం **********

21-05-2002న:గురుస్మరణ, కఠోరనియమపాలన, సద్గురు కృప

గొలగమూడి, 21-05-2002


డియర్ సర్,


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి


నీ లెటర్ చేరింది. నీ జీవితం నీవనుకున్నట్లు చాలా తేలికగాను నీచంగాను లేదు. ప్రతి ఒక్కరికి తన తప్పు తెలుసుకోకుండా మూర్ఖంగా జీవించడమంటేనే చీకటి బ్రతుకు. **నీ తప్పు తెలుసుకున్నావంటే లైట్ వేశావని అర్ధం. ఇక ఇల్లు సర్దుకోవడమే కావలసింది.** ఇల్లు **సర్దుకోవడానికి గట్టి పట్టుదల కావాలి. ఇది రావాలంటే గురుస్మరణే అవసరము. గురుస్మరణమంటే అందరు మహనీయుల రూపాలలో వున్న విశ్వగురుని దివ్య లీలలు స్మరించడమే**. మన మనస్సు చాలా ఎక్కువ voltage గల యంత్రం వంటిది. దాన్ని నియంత్రణతో ఉపయోగించకుంటే చాలా నష్టపోతాము. ఒకసారి నష్టపడ్డాక ఇక తిరిగి ఆ నష్టాన్ని భర్తీ చేయలేము. గనుక నియమపాలన చాలా అవసరం.

**నియమపాలన కాదు, కఠోర నియమపాలన. అప్పుడే మనం సద్గురు కృప పొందగలము**. మీరు చెప్పిన పులి విస్తరాకులు ప్రపంచం నిండా ఎక్కడబడితే అక్కడే కావలసినన్ని ఉన్నాయి. అసలు అలాంటి వ్యక్తులతో స్నేహమే పనికిరాదు. మనలను బాగుపరచినా, చెడ గొట్టినా స్నేహితులే కారణం. గనుక ఈ సత్యాన్ని బాగా మననం చేసి పది రూపాయలు పోయినా మంచి స్నేహం చేయి. పది రూపాయలు పోయినా ఫరవాలేదు, చెడు స్నేహం వదిలేసేయ్.

**ప్రతినిత్యం సరైన టైం లో నిద్రపోవడం, సరైన టైములో నిద్రలేచి నిత్యకృత్యాలు తీర్చుకోవటం చాలా ముఖ్యము.** స్నేహితులంతా చెడిపోయిన వానిని చూచి నవ్వుతారు. అంతేగాని ఏ సహాయము చేయలేరు. కానీ సద్గురువొక్కరే మనలను అన్ని వేళలా రక్షించి కాపాడతారు. నీకు సద్గురు








కృప ఉంది గనుకనే U.S కు వెళ్లే యోగం పట్టింది. **మన నియమపాలనలో ఏ లోపం వచ్చినా సద్గురుని కృప అంతమేరకు పోగొట్టుకుంటామని ఎందరి అనుభవాలో తెలుపుతున్నాయి.** ఈ విషయంలో నీవు చాలా జాగ్రత్తగా ఉండు. **ధర్మం ధర్మం ధర్మం ఇది మాత్రమే సద్గురుని మెప్పిస్తుంది. ధర్మం తప్పినాక మెయిన్ లైన్ తో electrical contact పోయిందన్నమాట. అది పోతే మనమెందుకూ పనికిరాము.**

భట్ గారి విషయం మనసులోకి రానివ్వడమే దోషం. వారు నీతో మాట్లాడతారని ఎందుకు ఊహిస్తున్నావు. **మాట్లాడితే కూడా ధర్మం ప్రకారం ఉండాలి. కానీ అనవసరమైన ఆపేక్షలు పెంచుకోవడం అధర్మం.** ఈ వివాహానికి పెద్దల అనుమతిగాని సద్గురుని ఆదేశం కానీ లేవు గనుక బాగా దూరం వుండు. సద్గురుడు ఆదేశిస్తే ఆయననే జరిపించమని చెప్పి నిర్భయంగా ఉండు. నీవు వారితో నోరు జారి ఎక్కువగా మాట్లాడవద్దు. **Control your spirits. ఇది ముఖ్యం. శ్రీ స్వామి వారికి నీ బాధలు విన్నవించుకో. నీ లెటర్ శ్రీ స్వామి వారి సమాధి మీద ఉంచాను. అన్నీ వారే చూచుకుంటారు. Be brave and devoted to sadguru.**

Yours lovingly, పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం *********


<u>20-12-1999 న సాయి శివకి: నిష్కామకర్మ ఎలా చేయాలో శ్రీ అనంతాచార్యుల వారి జీవితం చూసి నేర్చుకోవలసినవి</u>

ఓం

గొలగమూడి









20-12-1999

డియర్ సాయిశివ,

శ్రీ అనంతాచార్యులుగారు ఎట్లా నిష్కామకర్మ చేశారో నేను చూడలేదు. కానీ ఒక్క విషయం సత్యం. వారు తన పేషెంట్లను ఇంత ఇస్తేనే వైద్యం చేస్తానని నేటి వైద్యులులాగ చెప్పేవారు కాదు. హుండీ పెడుతారు. వారివారికి భగవంతుడు బుద్ధి పుట్టించినది వేసిపోతారు. ఒక్క రూపాయి మందు తీసుకున్న వారు వంద రూపాయలు వేయవచ్చు, వంద రూపాయలు ఖరీదు గల మందు తీసుకున్నవారు ఒక్కరూపాయి వేయవచ్చు. **అసలు తనను తన పిల్లలను పోషించే దాత ఆ భగవంతుడు, గనుక ఆ భగవంతుడు తన చేత చేయించుకున్న వైద్యాన్ని క్షుణ్ణంగా చేయడమే తన కర్తవ్యంగా భావించి చేసారు.** ఆ రోజులలో సవరు బంగారు 50 రూ. అలాంటి సమయంలో రోజుకు 300రూ హుండీలో వచ్చాయంటే 6 సవర్ల బంగారం. అది ఈనాటి ధరను బట్టి 18,000 రూపాయలన్నమాట రోజు రాబడి.

ఇదంతా దాచుకోలేదు. సాయి వలె ఖర్చు చేసేవారు. తేనె, నెయ్యి, పాలు, పండ్లు, ఎండుద్రాక్ష లాంటివి ఇంటి నిండా వచ్చేవట. అన్నీ పంచేసేవారట. తనకు, తన బిడ్డలకని దాచుకోకుండా అన్ని విషయాలకు భగవంతుని మీద ఆధారపడి జీవించారు అని మాష్టారు చెపితే మాకు తెలిసింది. ఈ విషయాన్ని శ్రీ కృష్ణమాచార్యుల శిష్యులు వ్రాసిన ఒక

గ్రంథంలో చదివాను. అలా నిష్కామ కర్మను త్రికరణ శుద్ధిగా ఆచరించబట్టే శ్రీ సాయినాధుడు వారికి 15 రోజులు పాటు భౌతిక దర్శనం ప్రసాదించారు.

**"వాళ్ళుండే దాన్ని బట్టి గదయ్యా మనముండేది" అక్షరాల పరమ సత్యం. ప్రతి ఒక్కరికి అన్ని కాలముల యందు వర్తిస్తుంది. మనం ఫ్రెండ్స్ అనే భావంతో మనలను బురదలోకి దింపేవారితో స్నేహం చేయడం చాలా అవివేకము. మంచి సహవాసమయితే పది రూపాయలిచ్చి కొనుక్కో. చెడు సహవాసమయితే పది రూపాయలిచ్చి వదిలించుకోమని ఊరక చెప్పారా.** విమర్శలు తగవని సాయి చెప్పినా మనం లెక్క చేయకుండా వింటుంటే ఆ మలినం మనకు చుట్టుకోకుండా పోతుందా? కనుక చాలా జాగ్రత్తగా ఉండాలి. అసలు లోకం ఎట్లా పోతే మనకేమి. మనం లోకాన్ని ఉద్ధరించగలమా**?** **మన కర్తవ్యం మనం చేసుకుపోతే చాలు**. వాదాలు, వంతులకు దూరంగా ఉండడం నేర్చుకోవాలి. ఒకటి రెండు మాటలే చెప్పాలి కానీ మన వాదాలు వంతులతో ఏమీ తెల్లవారదు.


**"మైసూరు మహారాజు కనిపిస్తే ..................." నిజమే కదా! వారు పరమ దయామయులే. ఆ దయను మనం అందుకొని నిలుపుకునే స్థితిలో ఉండవద్దా.** కరెంటు ఉంది, దాని నుండి వెలుగు పొందాలంటే వైరింగు, స్విచ్, బల్బు అన్నీ సరిగా ఉండవద్దా, అంతే. సాయి దయామయుడే – అందరినీ ఉపాసనీ బాబా లాగా తీసుకు వచ్చి ఎనిమిది రోజులు నడిచినా ఎనిమిది కిలోమీటర్లు నడవలేనట్లు చేసారా! **ఆధ్యాత్మికత అనేది ఇరుపక్షముల పొందికతో రావలసిందే కానీ, ఏకపక్షం కాదు. మనకు పుణ్యం సున్న అయినప్పుడు వారెంత ఇచ్చినా నిలుపుకోలేము......**


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

**మాంసం పొందిన బ్రాహ్మణుడు దాన్ని నీటిలో పారేసినట్లు. మహాత్ముల దర్శనానికి పోయిన వారందరికీ ఒకే ఫలితమొస్తుందా? కొందరికి ఆ మహనీయుని చూడగానే సంతత ధారగా కన్నీరు కట్టలు తెంచుకుంటాయి. కొందరికి రోమాంచితము, కొందరికి ఇంకా కాస్త స్వీటు పెట్టకుండా ఉంచుకున్నారే అని, మరికొందరు ఈ సిగరెట్టు త్రాగే స్వామి దగ్గరకా మనం రావడం అని అనిపించడం లేదా?** కరెంటు అక్కడ ఉంటే దానిని తీసుకునే శక్తి, ప్రకాశించే శక్తి బల్బుకు ఉండాలి. ఒకటి 80 volts మరొకటి 120 volts కనుకనే భగవద్గీత అంతా మన ప్రయత్నానికే ప్రాధాన్యం ఇచ్చింది. అలాగే యోగవాశిష్టం. **భగవంతుడు మనకు చదువుకునే ప్రాప్తమిచ్చి చదువుకోమంటే భగవంతుడు ఇచ్చిన ఆ పని మాని నిరంతరం భజన చేస్తానంటే ఆయన ఏమి చేస్తాడు. ఆయన సంకల్పాన్ని నెరవేర్చాలి. అది మన ముఖ్య కర్తవ్యం. అది పోతే అన్నీ పోయినట్లే. మహనీయులు మన అర్హతతో సంబంధం లేకుండానే అనుగ్రహిస్తారు. కానీ మనం మన అర్హత ఉన్నవరకే దానిని దక్కించుకుంటాము.**

**"ఇంద్రియాణాంహిచరతాం యన్మనోను విధీయతే**

**తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివాంబసీ"**

గాలిచేత పడవ యొక్క వేగం తగ్గిపోయినట్లు ఇంద్రియములలో చలించు మనసు యొక్క ప్రజ్ఞ హరించబడును అన్నారు.

**ఆకలికి అన్నం కాని చిరుతిండి కాదు. చిరుతిండి జిహ్వాచాపల్యం వలన తింటాము. అది ఎంతమేరకు పొతే అంత లక్ష్యశుద్ధి కుదురుతుంది. మనలో జరిగే ప్రతీ భావస్పందనకూ కొంత శక్తి ఖర్చవుతుంది. చిరు తిండ్ల**

**వారికి శక్తంతా దానికే ఖర్చవుతుంది. ఇక లక్ష్యం కొరకు చేసేదేముంది. నిజంగా లక్ష్యశుద్ధి గలవారికి చిరుతిండ్ల విషయం గుర్తేరాదు.**

మానవులకు (1) బ్రహ్మచర్యాశ్రమము (2) గృహస్థాశ్రమము (3) సన్యాసాశ్రమము (4) వానప్రస్థాశ్రమము (5) ఆశ్రమ ధర్మాలు లేని అతి ఆశ్రయము అని ఉన్నాయి.

**భగవంతుడు మనలను ఏ ఆశ్రమంలో ఉంచితే ఆ ఆశ్రమ ధర్మాలు పాటించాలి**.

బ్రహ్మచారులు – ఆంజనేయస్వామి వారిని ఆదర్శంగా తీసుకుని అష్టవిధ బ్రహ్మచర్యం వహించాలి. అంతే గాని గృహస్థు ధర్మాలు, వానప్రస్థ ధర్మాలు పాటించరాదు. **భగవంతుడు మన నుండి కోరిన విద్యా ప్రావీణ్యం గడించి భగవంతుని ఆ విద్యతో ఆరాధించాలి. అనంతాచార్యుల వలె అందరిలోని పరమాత్మను వారి వలె ఆరాధించాలంటే ముందు విద్యా ప్రావీణ్యం సంపాదించాలి. అన్యచింతలు లేకుండా విద్యాధ్యాసలో ఉంటే అన్నీ అవే వస్తాయి**. గృహస్థు గృహస్థుగా ఉండాలి.

భగవంతుడు నిర్దేశించిన పని ఆయనకు తృప్తికరంగా నిర్వహించాలి. పారాయణ, పూజలు చేస్తే మనం ముందుకు పోతామని కఠినంగా శరీరాన్ని కష్టపెట్టరాదు (ఆంధ్ర యోగులు అను గ్రంథంలో మాణిక్య ప్రభు శిష్యురాలు దిగంబర యోగిని చెపుతారు).


దీన్ని మాష్టరు గారు ఆచరించి చూపారు. తాను టిఫిన్ తినకుంటే అమ్మగారు తినరని నిత్యం ఇడ్లీ తినేవారు. మాష్టరు గారి ఉచ్ఛిష్టం అని


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

అమ్మగారు నిత్యం రెండు ఇడ్లీలు స్వీకరించేవారు. అంతేకానీ సాయిని మెప్పించాలని నిరాహారి కాలేదు. మనం కఠిన నియమాలు పెట్టుకొని శరీరం శుష్కింప చేసుకుంటే సాయి మెచ్చుకుంటారా? అతిగా తినవద్దన్నారు కాని నిరాహారులు కమ్మనలేదు. గృహస్థుగా తన విధి నిర్వహించాలి. అదీ సాయి మెచ్చుకునేటంతగా చేయాలి. గృహస్థు - సన్యాసి ధర్మాలు పాటిస్తానంటే సరిపోతుందా? **ఇంట్లో అందరినీ భగవంతుని రూపాలుగా చూస్తాను, సేవిస్తాను అని నిత్యం ప్రమాణం చేయడమే "త్వమేవ మాతాచ పితాత్వమే...." అన్న ఆరతి పాటలోని అర్థం.** అలా చేయాలి, సేవించాలి గాని పాట మాత్రం పాడి గృహనిర్వహణలో లోపం చేస్తానంటే సాయి ఏనాడైనా ప్రశ్నించరా? ఎదురుగా వచ్చి ప్రశ్నించకున్నా గాని ఆ లెక్క అలాగే ఉంటుంది బాకీ పడి.

**నీవు చక్కగా చదువుకుని తల్లిదండ్రులను సుఖపెట్టాలి. తల్లిదండ్రుల రూపాలలో సాయి ఉన్నారని నిరంతరం గుర్తు పెట్టుకోవాలి. నిత్యం పూజ, పారాయణ వీలైనంత వరకు చెయ్యి. నీవు చక్కగా చదవడం సాయికి చేసే పూజ అవుతుంది. అదే నిజమైన పూజ. అలా ఆర్జించిన విద్య ద్వారా అనంతాచార్యులు చేసినట్లు నిష్కామకర్మ చెయ్యి. ప్రతి విషయం మాష్టారు చక్కగా బోధిస్తారు. ఆయన వాణి విని చూడు.**

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ

మీ

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********



**సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ పాదుకలు**